క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ హేమలత

బోడుప్పల్: 18వ డివిజన్ పరిధిలోని కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ హేమలతాజంగారెడ్డి శనివారం మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగంకు వినతిపత్రం అందజేశారు. ఉదయ్‌నగర్‌లో వీధిలైట్లను ఏర్పాటు చేయాలని, శ్రీలక్ష్మీనగర్ కాలనీ, శ్రీనగర్‌కాలనీలో ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేయాలని, సాయిరాంనగర్ కాలనీలో కమ్యూనిటీహాల్ పనులను పూర్తిచేయాలన్నారు. ఈస్ట్ హనుమాన్‌నగర్‌లోని పార్కు స్థలంలో షెటిల్‌కోర్టు, ఫ్లోరింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



జలమండలి అధికారులతో కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సమస్యలపై శనివారం జలమండలి అధికారులతో నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని అవసరమైన చోట కాలనీల్లో నూతన డ్రైనేజీ పైపులైన్ల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని చెప్పారు. జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, సివరేజ్ సూపర్‌వైజర్ రాకేష్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గోకుల్ యాదవ సంఘం ప్రతినిధులు

గౌతంనగర్: సమష్టి కృషితోనే యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకుందామని, యాదవ సంఘం మండలి రాధాకృష్ణ యాదవ్ అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన గోకుల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతన కేలండర్ 2025ను శనివారం కట్టమైసమ్మ దేవాలయంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు బాల్‌రాజుయాదవ్, శ్రీను, బిక్షపతి, నర్సింహ్మా, బాల్‌రాజు, పివి.రమణ, కృష్ణ, రాంచందర్, అంజయ్య, సత్యనారాయణ, సుమలత పాల్గొన్నారు.

కలుషిత తాగునీటి సరఫరా



మల్లాపూర్: డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో గతవారం రోజులుగా రోడ్డు నెంబర్, 4,5,6 లలో కలుషిత తాగునీటి సరఫరా అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ నీరు తాగిన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. తాగునీటిలో డ్రైనేజీ నీరు ఎక్కడా కలుస్తుందో అధికారులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



సంతోషిమానగర్‌లో పడిపూజలో స్వాములు

మౌలాలి: సంతోషిమానగర్‌లో అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. పలు రకాల పూలు, పండ్లతో స్వామివారిని సుందరంగా అలంకరించారు. సురేష్‌సింగ్ గురుస్వామి ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. గురుస్వాములు రవికుమార్, గురుస్వామి, కృష్ణగౌడ్, ఉమాకాంత్, చరణ్‌తేజ, సాన్విక పాల్గొన్నారు.

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జేఎల్ఎస్‌ఎస్‌నగర్ చౌరస్తాలో సత్యనారాయణ సన్నిదానంలో అయ్యప్ప మహా పడిపూజ భక్తి శ్రద్ధలతో జరిగింది. అయ్యప్ప స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. నవీన్‌కుమార్‌స్వామి, సాయికిరణ్ స్వామి, సాయిస్వామి, నరేష్ స్వాములు పాల్గొన్నారు.

తొలగించారు.. తరలించడం మరిచారు

- 2019లో నాటిన కొనోకార్పస్ మొక్కలు
- అనారోగ్య సమస్యలొస్తున్నాయని ఆరోపణలు
- సైంటిఫిక్‌గా రుజువు కాలేదంటున్న యూబీడీ సిబ్బంది
- ప్రజాధనం వృధా చేశారని పలువురి ఆగ్రహం



తొలగించిన కొమ్మలను వదిలేసిన అధికారులు

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ పద్మశాలీ టౌన్‌షిప్‌లో కొనోకార్పస్ చెట్లను అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు తొలగిస్తున్నారు. ప్రధాన రహదారిలో డివైడర్ల మధ్య 2019లో ఈ మొక్కలను నాటారు. ఈ చెట్లతో ప్రజలకు అనారోగ్యాన్ని కలిగిస్తుందని, శాస్త్రవేత్తలు కూడా నిర్ధారిస్తున్నారని పలువురు చెబుతున్నారు.

శ్వాసకోశ వ్యాధులు..

ఈ చెట్ల పెంపకం ద్వారా పర్యావరణానికి విఘాతం కలగడమే కాకుండా చెట్ల కాయల నుంచి వెలువడే పుప్పొడితో ప్రజలకు ఆస్తమా, అలర్జీ, శ్వాసకోశ వ్యాధుల భారినపడే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. కొనోకార్పస్‌ను 'డేంజర్ ట్రీ' గా గత ప్రభుత్వం గుర్తించి నిషేధించింది. దీన్ని నిర్మూలించడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఎందుకు పెంచుతున్నారు.. ?

ప్రమాదకర చెట్లు ఎందుకు పెంచుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తుంటే.. అది సైంటిఫిక్‌గా రుజువు కాలేదని అర్బన్ బయోడైవర్సిటీ (యూబీడీ) సిబ్బంది చెబుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రస్తుతం కొనోకార్పస్ చెట్ల తొలగింపు చర్యలు చేపట్టామని, అది పూర్తిస్థాయిలో తొలగించే అధికారం తమకు లేదంటున్నారు.



ఏఎస్‌రావునగర్ పద్మశాలీ టౌన్‌షిప్ వద్ద తొలగించిన చెట్ల కొమ్మలు

ప్రజాధనం వృధా..

ప్రజలకు అనారోగ్యాన్ని కలిగించే ఈ చెట్లు పెంచడం ఎందుకని, ప్రజాధనం వృధా చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్క నాటడం, సంరక్షణకు ఒక్కో మొక్కపై ప్రభుత్వం సుమారు రూ.500 మేర ఖర్చు చేసిందన్నారు.

పర్యావరణహితమైనవి పెంచొచ్చు..

ఒక మొక్కను నాటాక చెట్టుగా మారాలంటే కనీసం 3-4 ఏళ్లు పడుతుంది. 2019లో నాటిన ఈ మొక్కలు నేటి వరకు సంరక్షించేందుకు ఎంత మేర ఖర్చు చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఖర్చంతా నెలపాలైనట్లేనని భావిస్తున్నారు. ఇలాంటి ప్రజలకు హాని కలిగించే మొక్కలు కాకుండా పర్యావరణం, మానవాళికి లాభసాటి మొక్కలు పెంచొచ్చు కదా.. అని సూచిస్తున్నారు.

ఇబ్బందుల్లో పాదచారులు..

పద్మశాలీ టౌన్‌షిప్ ప్రధాన రహదారి డివైడర్ల మధ్యలో ఉన్న కొనో కార్పస్ చెట్లు తొలగించిన యూబీడీ సిబ్బంది వాటిని రోడ్ల పక్కనే వదిలేశారు. రోడ్డు పొడవునా ఇరువైపులా తొలగించిన చెట్లు అలానే ఉండటంతో పాదచారులు, మార్నింగ్ వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే తొలగించిన చెట్ల కొమ్మలను ఇక్కడి నుంచి తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గౌతంనగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని, ఎమ్మెల్యే మర్రి రాజశేఖరెడ్డి అన్నారు. గౌతంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు కిరణ్‌పట్నాయక్, నరసింహరావు, ప్రభాకర్, ఎం.బాలచందర్ శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా గౌతంనగర్ గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటుతో పాటు కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గౌతంనగర్ కమ్యూనిటీహాల్ లిఫ్ట్ ఏర్పాటుకు తనవంతు సాయంగా రూ. 50 వేలను ఎమ్మెల్యే అసోసియేషన్ ప్రతినిధులకు అందజేశారు. గౌతంనగర్‌లో రైల్వే అండర్ బ్రిడ్జితో పాటు కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డితో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

పీజేఆర్‌కు ఘన నివాళి

అల్వాల్: పేదల పెన్నిధి కార్మికనేత మాజీ సీఎల్పీ నేత పి.జనార్దన్‌రెడ్డి సేవల మరువలేనివని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. అల్వాల్‌లో పీజేఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన విగ్రహానికి నివాళులర్పించి, చేసిన సేవలను కొనియాడారు. నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, చంద్రశేఖర్, కృష్ణగౌడ్, బలవంత్‌రెడ్డి, శివకుమార్, శేఖర్‌రెడ్డి, నాగేశ్వరరావు, కిట్టు, సంజీవ్ కుమార్, సంతోష్‌రెడ్డి, సంతోష్ సాగర్, ఓంకార్, శకుంతలనాయుడు, పద్మ, నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మల్లాపూర్: నాచారం సావర్కర్‌నగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా పడి పూజకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేత సాయిజెన్‌శేఖర్ హాజరయ్యారు. మల్లేష్‌యాదవ్, ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, బుచ్చన్నగౌడ్, భూపాల్‌రెడ్డి, రాంచందర్, టీకే రాజశేఖర్, మల్లికార్జున్, యూసఫ్, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.



అయ్యప్ప పడి పూజలో ఎమ్మెల్యే బండారి

మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ



బోడుప్పల్: నగర పాలక సంస్థ సిబ్బందికి బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల యాజమాన్యం దుస్తులు పంపిణీ చేసింది. శనివారం పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ.. క్రిస్మస్ సందర్భంగా దుస్తులు పంపిణీ చేసినట్లు వివరించారు. సిబ్బంది నిత్యం పరిసరాల పరిశుభ్రత, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు కృషి చేస్తున్నారని, తాము చేసింది చిన్నదేనన్నారు. స్కూల్ ఇన్‌చార్జి విజయకుమారి పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీ గురు నృత్యాలయ డాన్స్ అకాడమీ సౌజన్య చంద్రశేఖర్ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో గణేశాకౌతం, నాగస్తుతి, జనుత శబ్దం, అన్నమాచార్య కీర్తనలు, భో శంభో బ్రహ్మాంజలి, కల బైరవాష్టకం, హరహర శంభో, కృష్ణ కలయ సఖి, జయజయ, నటరాజ, నెమలినాట్యం , అచ్యుతం కేశవం తదితర అంశాలను కళాకారులు హిరణ్య, సహస్ర, దామిని, దీక్ష, నైనికా, ఇషాన్వి, సంజన తదితరులు ప్రదర్శించి మెప్పించారు.



ఉప్పల్ మినీ శిల్పారామంలో కళాకారులు

'ఒకే దేశం ఒకే ఎన్నిక'తో రాష్ట్రాలకు నష్టం

కుషాయిగూడ: ఒకే దేశం ఒకే ఎన్నికతో రాష్ట్రాల హక్కులకు భంగం కలుగుతాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో శనివారం జరిగిన సీఐటీయూ అఖిల భారత పూర్వ అధ్యక్షుడు బాలనందం శత జయంతి సందర్భంగా ×మతోన్మాదం, రాజ్యాంగ హక్కులు¤ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఒకే దేశం ఒకే ఎన్నికతో ప్రాంతీయ పార్టీలు కనుమరుగయ్యే అవకాశం ఉందన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్‌వీ.రామ, సీనియర్ నేతలు రాజారావు, ఎర్ర అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు

కేలండర్ ఆవిష్కరణ

కాప్రా: శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం నూతన కేలండర్ 2025ను ఆవిష్కరించారు. కాలనీలో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ కృషి చేయాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ సబ్ స్టేషన్ 33/11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దేవేందర్‌నగర్, లక్ష్మీనారాయణ కాలనీ, జెర్సీలేన్, శ్రీరామకాలనీ, వెంకటసాయినగర్, కురుమానగర్, సత్యానగర్, లక్ష్మీశ్రీకాంత్‌నగర్, కేటీఆర్‌నగర్, భరత్‌నగర్ రోడ్డు తదితర ప్రాంతాలతో పాటు డీమార్టు, ఉప్పల్ శిల్పారామం, వాసవీలేన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నవోదయ పాఠశాలను కేటాయించాలి

బోడుప్పల్: మేడిపల్లి మండల పరిధిలో జవహర్‌నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ పార్టీ నేతలు దేవరకొండ వెంకటాచారి టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. మేడిపల్లి మండల పరిధిలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చాలా మంది ఉన్నారని, వారికి మెరుగైన చదువు అందించేందుకు సీఎం చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పారపట్టి.. ట్రాఫిక్ క్లియర్ చేసి..



ఉప్పల్: ట్రాఫిక్ కంట్రోల్ చేయడమే కాకుండా స్వయంగా పార పట్టి మట్టి తీయగలమని ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి నిరూపించారు. శనివారం ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై తాగునీటి పైపులైన్ పగిలి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. నీటి ప్రవాహం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోగా.. సమయానికి ఎవరూ స్పందించ లేదు. దీంతో మ్యాన్‌హోల్ మూతను తొలగించడంతో ట్రాఫిక్ సమస్య తీరింది. నెటిజన్లు వీడియో తీసి మాధ్యమాల్లో పోస్టు చేయగా.. అది వైరల్ అయ్యింది.

పరామర్శ

కుషాయిగూడ: అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన బీఆర్ఎస్ కార్మిక నేత మారుతీరావును శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బీఆర్ఎస్ నేత కాసం మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కాప్రా: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారం, ఈసీఐఎల్ క్యాడర్ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలకు 4 నెలల పాటు వివిధ కోర్సుల్లో శిక్షణనిచ్చి పలు కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు నాగరాజు, యాదయ్య తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి పాస్/ఫెయిల్ అభ్యర్థులకు వారి అర్హత ఆధారంగా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల 18 ఏళ్ల నుంచి 27ఏళ్ల లోపు యువతీయువకులు టెక్ మహీంద్ర ఫౌండేషన్ ఈసీఐఎల్ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9100056583, 8885512037.

ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వాసుపత్రి

ఆసుపత్రిని సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్

అల్వాల్: అల్వాల్‌లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వాసుపత్రిని త్వరలో ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం అల్వాల్‌లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వాసుపత్రిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఉండేదని, పాత బిల్డింగ్ స్థానంలో కొత్త బిల్డింగ్ కడితే మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని భావిస్తే, బిల్డింగ్ పూర్తిచేసిన కాంట్రాక్టర్‌కు డబ్బులు రాలేదని బిల్డింగ్‌కు తాళాలు వేసుకోవడంతో వైద్యసేవలు నిలిచిపోవడం బాధాకరమన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందాలి..

రాజకీయ పట్టింపులు, కాంట్రాక్టు బిల్లులు రాకపోవడంతో పేద ప్రజల వైద్యంపట్ల పట్టింపు లేకపోవడం శోచనీయమన్నారు. ఎంపీ ఈటల తక్షణమే వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడారు. అల్వాల్‌లో ఆసుపత్రిని త్వరలో ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన వైద్య పరికరాలు తీసుకురావాలి..

నూతన ఆసుపత్రిలో వైద్యపరికరాలు తీసుకొచ్చి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పేద ప్రజానీకానికి వైద్యం అందేలా కృషి చేస్తానని ఎంపీ ఈటల ప్రజలకు హామీ ఇచ్చారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో. డాక్టర్ శోభారాణి, డాక్టర్ శైలజ, గిరికాంత్, సుజనా, అరుణ, రాణి, స్థానిక నేతలు మల్లికార్జునగౌడ్, మణిక్యరెడ్డి, కార్తీక్‌గౌడ్, లక్ష్మణ్, రాజిరెడ్డి, గోపి, అనిల్‌రాజ్, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్‌లో ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నగరాన్ని హరితయుత పట్టణంగా తీర్చిదిద్దేందుకు విశ్వ స్వచ్ఛంద ఆధ్వర్యంలో శనివారం లోతుకుంట ఇందిరానగర్ కమ్యూనిటీహాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. మన పరిసర ప్రాంతాలను కాలుష్య రహితంగా మార్చేందుకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఇందిరానగర్ కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, పెద్ది రమేష్, అరుణ్‌కుమార్, వెంకటనారాయణ, విశ్వ సస్టైనబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు సూర్యనారాయణ, వినయ్, బ్రహ్మచారి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. మచ్చబొల్లారంలోని మోతులకుంటచెరువు సమీపంలోని సర్వేనెంబర్ 198,199లో హిందూ శ్మశానవాటికను అల్వాల్ జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా డంపింగ్ యార్డుగా మార్చారని, దీంతో చుట్టుపక్కల 50 కాలనీల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అల్వాల్ సర్కిల్ ఏఎంహెచ్‌వో రజిని, రాంకీ అధికారులతో మాట్లాడి తక్షణమే డంపింగ్‌యార్డు ప్రాంతానికి రావాలని ఆయన సూచించారు. రోజూ డంపింగ్ యార్డులోని చెత్తను ప్రాసెస్ చేసి ఇక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. పరిస్థితి మారకుంటే స్థానికులతో కలిసి అల్వాల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతానని హెచ్చరించారు. 48 కాలనీల జాయింగ్ యాక్షన్ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు రమేష్, పరమేష్, శోభన్‌బాబు, మల్లేష్‌గౌడ్, యాదగిరిగౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



డంపింగ్‌యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్‌లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి సూచించారు. శనివారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రోడ్లు, కమ్యూనిటీభవన్‌ల మరమ్మతులు తదితర విషయాలపై కూలకషంగా చర్చించారు. ఈఈ నాగేందర్, డీఈ రూప, ఏఈ స్రవంతి పాల్గొన్నారు.

◆ నెహ్రూనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. శనివారం నెహ్రూనగర్‌కు చెందిన రామాంజనేయులు, రమేష్‌లు కార్పొరేటర్‌తో సమావేశమయ్యారు. రెండో బ్లాక్‌లోని కమ్యూనిటీహాల్ మెయింటెన్స్, శ్మశానవాటికలో రూమ్‌డోర్లు, నీటిసరఫరా పిచ్చి మొక్కలను తొలగించి, లైట్లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కోరారు.

కార్యకర్తలే మా బలం బలగం

జిల్లా బీజేపీ ఇంచార్జి బాలకృష్ణగౌడ్

రామంతాపూర్: బీజేపీకి కార్యకర్తలే బలం, బలగమని జిల్లా బీజేపీ ఎన్నికల సహ ఇన్‌చార్జి రావుల బాలకృష్ణగౌడ్ అన్నారు. శనివారం రామంతాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ క్రియాశీలక సభ్యత్వం బూత్ కమిటీ పత్రాలను నియోజకవర్గ కన్వీనర్ దేవసాని బాలచందర్, కార్పొరేటర్ బండారి శ్రీవాణి, డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్‌రావు, జిల్లా ఎన్నికల సహ ఇన్‌చార్జికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదులో ఉప్పల్ సర్కిల్‌లో ముందంజలో ఉందన్నారు. బీజేపీ నేతలు జగదీష్, కుమారస్వామి, నారాయణదాసు పాల్గొన్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో డెకరేషన్ షాపు దగ్ధం

రూ.25 లక్షల మేర నష్టం

కుషాయిగూడ: ఓ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధి కాప్రాలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్ర కుమార్‌గౌడ్ కాప్రా, శ్రీనగర్‌కాలనీలో డెకరేషన్ షాపును నిర్వహిస్తున్నారు. సాయంత్రం షాపు మూసి ఉన్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.25 లక్షల సామగ్రి దగ్ధమైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.



ప్రమాదంలో కాలి బూడిదైన సామగ్రి

ఉచిత వైద్య శిబిరం

అల్వాల్: వేదాన్ష్ క్లినిక్ సౌజన్యంతో పపిల్లోన్స్ ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ కరుణశ్రీ ఆధ్వర్యంలో శనివారం బొల్లారం స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు చిన్నారులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పోషకాహార నిపుణులు చిన్నారులకు పలు ఆహార పోషకాలపై అవగాహన కల్పించారు. డాక్టర్లు సంతోష్‌కుమార్, సందీప్‌కుమార్, సందీప్ రాథోడ్, న్యూట్రిషనిస్ట్ శ్రీజ, స్కూల్ ప్రిన్సిపాల్ కరుణశ్రీ, ఉపాధ్యాయులు నవనీత, సరోజ, మానస, రజని, సుమలత పాల్గొన్నారు.



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యులు